# న్యాయం - ధర్మం

పిల్లలు స్కూలునుంచివచ్చేవేళ గుంపులు గుంపులుగా జంటలు జంటలుగా పిల్లలుబుజాలమీద చేతులువేసుకుని గేటుదాటుతున్నారు. కొందరినిసైకిళ్లమీద కార్లమీద పెద్దవాళ్ళువచ్చి తీసుకుపోతున్నారు. ఇంకా చెట్లదగ్గర ఆడేపిల్లలు ఫుట్‌బాల్ ఆడే ఎదిగినపిల్లలు ఆడుతునేఉన్నారు. వాళ్ళకు ఇళ్ళదగ్గరస్థలంలేదు. సమీపంలో ప్లేగ్రౌండూలేదు.

"ఇళ్ళకువెళ్ళండి" స్కూలు నౌకర్లు వాళ్ళనుమందలించి పంపించేస్తూ ఉంటారు. ఆరుగంటలు దాటినతరువాత పరీక్షపేపర్లు, పుస్తకాలు సర్దుకుంటూ కూర్చున్న టీచర్లు? లైబ్రరియన్‌కూడా ఉండరు. వాచ్‌మన్ గేటుతాళం వేసేస్తాడు.

మార్కండేయులు కొడుకు శేషు పద్నాలుగేళ్ళవాడు ఎనిమిదవక్లాసు చదువుతున్నాడు ఆ స్కూల్లోనే. ఆయన ఆఫీసునుంచి వచ్చేసరికి తండ్రికి ఎదురుగా వచ్చేవాడు.

ఇవాళ రాలేదు.

ఇంటికీ స్కూలుకూ చాలాదూరం. అందుకని నమ్మకమయిన రిక్షావాడిని మాట్లాడి నెలకింతని ఏర్పాట్లుచేశాడు. స్కూలు విడవగానే గేటుముందరఉన్న రిక్షాలో శేషుఎక్కేవరకూ రిక్షావాడు ఊరుకోడు. ఆ కారణంగా నాలుగున్నరకల్లా శేషు ఇంటికి చేరుకునేవాడు.

"కామాక్షీ, శేషు ఇంటికివచ్చాడా?"

ఇవాళ రిక్షావాడు పొద్దున వేళకురాలేదు. తనే ఇంకొకరిక్షా తీసుకుంటానని వెళ్ళాడు. "వచ్చేటప్పుడు రిక్షాదొరికితే తొందరగానేవస్తాను. రిక్షా దొరక్కపోతే మాత్రం మా స్కూలుపిల్లలు కొందరు బస్సులోవస్తారు. వాళ్ళతోవస్తానని చెప్పాడు.

అయినా ఈపాటికి రావలసిందే. బస్సు దొరకలేదేమో? వాడికోసమే నేను ఇక్కడే తలుపుతీసుకుని కూర్చున్నాను." అంది ఎదురుచూస్తూ కూర్చున్న అలసటతో.

"బస్సు ఒకటికాకపోతే ఇంకోటి దొరుకుతుంది. అది బస్సురూట్, పైగా స్టాప్‌కూడా స్కూలుపక్కనే. మూడున్నరకు స్కూలు ఒదిలిపెడితే ఇంకా రాక పోవటం ఏమిటి? నేను స్కూలుకువెళ్ళి చూసివస్తాను" అంటూ స్కూటర్‌మీద బయలుదేరాడు. స్కూలుకువెళ్ళగానే పిల్లలందరూ వెళ్ళిపోయారని వాచ్‌మన్ చెప్పాడు. నౌకర్లందరూ వాకిట్లోనేఉన్నారు. వాళ్ళు అదేమాటన్నారు. "కాంటీన్ అమ్మగారుకూడా వెళ్ళిపోయారు. పెద్ద టీచరమ్మకూడా వెళ్ళి అర్ధగంటయింది. పిల్లలందరూ వెళ్ళారా? అని అడిగివెళ్ళారు"

మార్కండేయులుని చూడగానే అందరూ దిగ్గునలేచి జవాబుచెప్పారు.

శేషు రిక్షాలో మరొక అబ్బాయివెళ్తాడు. అతడియింటికికూడా మార్కండే యులు వెళ్ళి తెలుసుకున్నాడు.

ఆ అబ్బాయి-విఠల్. అతడి తండ్రి మార్కండేయులు ఆఫీసులోనే పనిచేస్తాడు. మార్కండేయుల్ని చూడగానే విఠల్ ఇంట్లోనుంచి పరుగెత్తుకుంటూ వచ్చి "ఇవాళ శేషు రిక్షాలో స్కూలుకు రాలేదండి. వెళ్ళేటప్పుడూ వచ్చేటప్పుడూ కూడా రిక్షాలో రాలేదు" అన్నాడు.

మార్కండేయులకి ఆదుర్దా ఎక్కువైయింది. "రిక్షాలో కాకపోయినా స్కూల్లోనయినా కలుసుకోవాలికదా? ఏమయిఉంటాడు?"

"విఠల్, శేషుకు స్నేహితులెవరైనా ఉన్నారా?"

"నాకు తెలిసినంతవరకూ ఎవరూలేరండి. అందరితో ఎక్కువగామాట్లాడడు" అన్నాడు విఠల్.

అక్కడినుంచి మార్కండేయులు తిన్నగా ఇంటికివెళ్ళి. శేషు ఫోటో కాపీలను అయిదారు క్రిందటి సంవత్సరం తీయించినవి తీసుకుని పోలీస్టేషన్‌కి వెళ్ళాడు.

వివరాలు కాగితమ్మీదరాసి "ఈ ఫొటోలో ఉన్న మా అబ్బాయి శేషు ఉదయం ఎనిమిదిన్నరకు స్కూలుకు వెళ్తానని ఇంటినుంచి బయలుదేరి ఇంకా రాలేదు" అంటూ ఇన్‌స్పెక్టర్ చేతికిచ్చాడు.

"మేము కనుక్కుంటాములెండి. పిల్లలు కనబడలేదని తండ్రులు ఇచ్చిన వివరాలు ఫొటోలు నాలుగు బల్లమీద ఉన్నాయి చూశారా? ఇలా రోజూ వస్తాయి. కొంత మంది పోలీసులను కేవలం ఈ పనిమీదనే ఊరంతా తిప్పుతూ ఉంటాము. తల్లిదండ్రులు పిల్లలను అదుపులో ఉంచుకోవాలి. రేడియోలో టీ. వీ.లోకూడా ఈ ప్రకటన చేయించండి" అన్నాడు.

"అదుపులో పెట్టుకోవాలని" ఇన్‌స్పెక్టర్ అన్నమాటకు మార్కండేయులకు తనున్న పరిస్థితులలో అతడా సలహా ఇచ్చినందుకు అభిమానం కోపం తన్నుకుంటూ పైకి వచ్చాయి. కాని తను కార్యార్థి. మాట్లాడకుండా "అక్కడికే వెళ్తున్నా"నంటూ వెళ్ళిపోయాడు.

రేడియో స్టేషన్లకు వెళ్ళి ప్రకటననిచ్చి మార్కండేయులు ఇంటికి వచ్చేసరికి ఎనిమిది గంటలయింది.

కామాక్షి వంటప్రయత్నం చెయ్యకుండా ఏడుస్తూ పడుకుంది. మార్కండేయులు తలుపుకొట్టగానే తీసింది. ఒంటరిగా వచ్చిన అతడిని చూడగానే దుఃఖమెక్కువైయింది.

వాళ్ళకు శేషు ఒక్కడే కొడుకు. ఊరికే పిల్లలతో ఆటలాడేవాడు కాడు. స్కూలునుంచి రాగానే పక్కయింటి పిల్లవాడితో స్కూలుసంగతులేవో మాట్లాడుతూ ఐదున్నరా ఆరు లోపల ఇంట్లో ఉండేవాడు. అతడిది ఇంకొక స్కూలు కనుక ఎంతపోర్షను వాళ్ళకయిందో తెలుసుకుని వచ్చేవాడు. తండ్రి వచ్చిన తరువాత ఆయన అడిగిన ప్రశ్నలకు జవాబిస్తూ కొంచెంసేపు టీ.వీ చూసి, ఏడున్నర ఎనిమిది గంటలమధ్య భోజనం చేసి తొమ్మిది గంటలవరకూ చదువుకునేవాడు.

రాత్రి పడుకోబోయేటప్పుడే పుస్తకాలు సర్దిపెట్టుకుని మరునాడు వేసుకునే బట్టలు తీసిపెట్టుకుని పక్కదులుపుకుని పడుకునే వాడు.

శేషుకు రెండవక్లాసు నుంచి ఐదవ క్లాసువరకూ వహీద్ అనే ఒక ఆఫీసర్ కొడుకుతో స్నేహమయింది. ఆ యిద్దరే ఆడుకునే వాళ్ళు. అతడి తండ్రికి నిరుడు ట్రాన్స్ఫరయింది. అప్పటి నుంచీ అతడికి స్నేహితులు లేరు.

శేషు పుట్టినప్పటినుంచీ ఎక్కడికీ వెళ్ళ లేదు. మేనమామల ఇంటికైనా వెళ్ళి వాళ్ళ పిల్లలతో ఆడుకోవాలని ఉండేది. ఆ ఊళ్ళో ఒక కాలవ ఉందని తల్లి చెప్పగా

విని వాళ్ళ పిల్లలతో ఈత నేర్చుకోవాలనుండేది. సినిమాలు టీ.వీ లో తప్ప స్నేహితులతో ఎప్పుడూ థియేటర్‌కి వెళ్ళి చూడలేదు. తల్లీ దండ్రీ నెలకొకసారి ఆదివారంనాడు సినిమాకు తీసుకువెళ్ళి ఇద్దరిమధ్యా కూర్చోబెట్టుకునే వారు. అతడు అందరితో ముభావంగా మాట్లాడేవాడు కాని అతడికి వహీద్ వెళ్ళినతరువాత ఇంత వరకూ మంచి స్నేహితులంటూ లేరు.

శేషు క్లాసులో చదివే పిల్లలెవరూ అతడికి స్నేహితులు కాలేకపోవటానికి కొన్ని కారణాలున్నాయి.

వాళ్ళు క్లాసులో కుదురుగా కూర్చుని టీచరుచెప్పిన పాఠాలు వినేవారుకారు. ఇంటరవల్లో ఒకరి డబ్బాను ఒకరు తెరిచి చూడటము, తిని అవతలి వాడిని ఏడి పించటం: ఒకరి బ్యాగులను ఒకరు తెరిచిచూడటం, డబ్బులు కనబడితే 'రేపిస్తా నురా'అని తీసుకోవటం వంటివి శేషుకు నచ్చవు. ఇంటరవల్లో అందరికీ దూరంగా ఒక చెట్టుకింద కూర్చుని తిని, గంట అయ్యేవరకూ అక్కడేఉండి, తరువాతనే లోపలికి వచ్చేవాడు. క్లాసులో టీచరు టెస్టు యిచ్చినప్పుడు ఇటూ అటూ చూసే వాడు కాదు. ఎవరయినా కాపీ చేసినట్టుగాని గుస గుస లాడినట్టుగాని కంటికి కనబడితే ఇంటికి వెళ్ళేముందర టీచర్‌తో చెప్పేవాడు. సహజంగా టీచర్లు మార్కులు కట్ చేసేవారు. పెద్ద పరీక్షలు వివిధ సెంటర్లలో జరుగుతూ ఉంటాయి. అక్కడ విద్యార్థులు ఒకరితో ఒకరు మాట్లాడటం కూడా తప్పే పేపరు రాసేటప్పుడు.

"అదిగో ఆ మూల చూడండిసర్! వాళ్లెట్లా మాట్లాడుకుంటున్నారో? చీటీల మీదరాసి ఒకరికొకరు అందించుకుంటున్నారు సర్" అని చూపించేవాడు. ఇన్విజి లేటర్లకు.

పిల్లలకు తగిన శిక్షపడేది.

పిల్లలకు శేషుమీద కసీ కక్షగా ఉండేది

శేషును స్కూలుకు తీసుకువెళ్ళే రిక్షావాడికి సంసారభారమెక్కువ. అందు కని డబ్బుకు ఆశపడతాడు. విఠల్ శేషూలతోపాటు మరోముగ్గురినికూడా రిక్షాలో కూర్చోబెట్టుకుంటూ ఉంటాడు.

"ఏమిటి రాములూ ? వాళ్లను ఎక్కించుకున్నావ"ని అడిగితే "ఇప్పుడు దిగిపోతారు బాబూ" అనేవాడు. నాలుగురోజులపాటు చూసి ఊరుకున్నారు శేషూ

విఠల్. అప్పటికే ఆ ఇద్దరూ సీటుమీద, ఇద్దరు కాళ్ళదగ్గర కూర్చునేవారు. ఈ నలుగురూకాక మరోఇద్దరినీ టాపువెనకాల ఖడ్డీమీద నిలబెట్టి తీసుకుపోతున్నాడీ మధ్య జనసందడిగల రోడ్లమీద.

తండ్రితో చెప్పాడు శేషు రిక్షావాడు చేస్తున్నపనిని.

''వాళ్ళు ఇంతేరా. డబ్బుకు ఆశపడి ఇటువంటిపనులు చేస్తారు సైకిలు కొని ఇద్దామంటే ఈ ట్రాఫిక్‌లో నీవు వెళ్ళలేవని భయం. ఇంకోరిక్షాను మాట్లాడ తాలే'' అన్నాడు.

ఆరోజు రిక్షావాడు మామూలువేళకు రాలేదుకాని పదిగజాల అవతల కలిసి పిల్లలను ఎక్కించుకున్నాడు.

శేషు ఆ ఇరుకుస్థలంలో కూర్చోలేక, టాప్‌వెనుక రాడ్‌మీద రెండురోజుల నుంచీ నిలబడుతున్నాడు. ఆ రెండవ పిల్లవాడు క్రిందటి సంవత్సరం పరీక్ష పోవటంచేత ఈ సంవత్సరం మళ్ళీ అదేక్లాసు పరీక్ష రాయవలసివచ్చింది. శేషు వల్లనే తనపరీక్ష పోయిందని పళ్ళుకొరుక్కునేవాడు.

క్లాసులో తను ఏమూలనో కూర్చున్నవాడిమీద శేషుకు ఇంతపగ ఎందుకు? పక్కవాడిచ్చిన కాగితం అందుకున్నంత మాత్రాన ఇన్విజిలేటర్‌తో చెప్పటమేనా? తనకు ఒకసంవత్సరం నష్టమయింది. లేకపోతే ఇప్పుడు ఎనిమిదవ క్లాసులో ఉండేవాడు. వీడిసంగతి ఎప్పుడో తేల్చలేకపోతానా ?" అని ఆలోచిస్తున్నాడు.

ఆ రోజు స్కూలుకి వెళ్లే రిక్షాలు ఒకదానివెంట ఒకటి స్పీడ్‌మీద నడుస్తున్నాయి. ఆ రోడ్డుమీద జనసందడి ఎక్కువ. ఈ రోడ్డును తప్పించి వెళ్ళాలంటే దూరమవుతుంది. పిల్లలకు వేళకూడా మించిపోతుంది.

సరిగ్గా ఆ సమయంలో ఒకబస్సు ఎదురుగా వస్తోంది. ఒకవేన్ వెనకనుంచి హార్న్ మ్రోగిస్తున్నది. రిక్షాలు తడబడి ఎదోవిధంగా సందుచేసుకుని పోవాలని ప్రయత్నించటంలో వరసలో రెండవవాడుగా ఉన్న రాములు సమయంకోసం చూస్తుండగా, ముందు రిక్షాకదిలింది. ఒకరిక్షా తరువాత ఒకరిక్షా వెళ్ళేబదులు చివరి రిక్షావాడు రాములును దాటిపోవాలన్న ప్రయత్నంలో చక్రాలు ఒకదానికొకటి తగిలి ఒరిగాయి. ఆ ఒరగటంచూసి శేషును పక్కపిల్లవాడు తోశాడు. అతడు భుజానికి తగిలించుకున్న సంచితోసహా రోడ్డుమీద పడిపోయాడు.

ముందుకు పోవటానికి తొందరపడటమేగాని వెనక ఏంజరిగిందో రాములు చూసుకోలేదు. స్కూలుకువెళ్ళి పిల్లలను దించి ఇంటికివెళ్ళాడు.

శేషు పడిపోయిన స్థలం పెద్ద బిజినెస్ సెంటర్.

శేషు పడిపోయినాడని పదినిమిషాల తరువాతచూసి దారినపోయేవారు పోలీసుకు రిపోర్టుచేశారు. అప్పటికే రెండుమూడు బండ్లు శేషుమీదినుంచి వెళ్ళాయి.

ఎప్పుడుపడ్డదీ ఎందులోనుంచి పడ్డది ఎవరూ గమనించలేదు. ఒకవిద్యార్థి రోడ్డుమీద పడ్డాడ'ని దగ్గరి ఆ పోలీసు స్టేషన్‌కి ఫోనుచేశాడు.

ఇన్‌స్పెక్టరు ఇద్దరుపోలీసులతో జీపులో పదినిమిషాలకు వచ్చాడు. విద్యార్థి బోర్లాపడ్డాడు. ముఖమంతా చితికినట్లయింది. బరువైన వాహనమొకటి అతడిమీదినుంచి పోయినట్టుగా అనుమానించాడు ఇన్‌స్పెక్టరు. పిల్లవాడి పుస్తకాల సంచి తెరిచిచూశాడు. అతడిపేరు, క్లాసు, స్కూలుపేరు పుస్తకాలమీద రాసి ఉన్నాయి వివరంగా.

ఇన్‌స్పెక్టరు పోలీసులతో వేన్ తీసుకువచ్చి హాస్పిటల్‌కి తీసుకువెళ్ళమని పంపించి ఆ చుట్టుపక్కల దుకాణాలవాళ్ళను "ఎట్లాపడ్డాడు ? దేనిలోనుంచి పడ్డాడు'' అని ఎన్నోరకాలుగా ప్రశ్నించాడు. ''సందడిలో అందరూ పడ్డ తరువాత చూసినవాళ్ళమే"నని చెప్పారు

ఇన్‌స్పెక్టరు అక్కడినుంచి తిన్నగా స్కూలుకి వెళ్ళి పుస్తకాలసంచీ చూపించి "ఇది మీస్కూలు విద్యార్థిదేనా చూడండి ?" అని అడిగాడు ప్రిన్స్‌పల్ని.

ఆయన సంచీని, పుస్తకాలను చూసి "శేషు అనే పిల్లవాడు మాస్కూలు పిల్లవాడే. ఈ సంచీకూడా అతడిదే. ఇది మీకెక్కడ దొరికింది ?'' ఆశ్చర్య పడ్డాడు.

''రోడ్డుమీద ఏక్సిడెంటయింది. అబ్బాయి ఈ సంచీతోకూడా కిందపడ్డాడు. బాగా దెబ్బలు తగిలాయి. గవర్నమెంటు హాస్పిటల్‌కి పంపించాము. ఈ అబ్బాయి తల్లిదండ్రులు ఎక్కడఉంటారు ? ఆయన ఎక్కడ పనిచేస్తారు ? వాళ్ళకు తెలియ పరచాలి.''

క్లాసు టీచరు పిల్లవాడి తండ్రి ఆఫీసు టెలిఫోను నెంబరు ఇచ్చాడు. ఫోను

చేయగానే ఆఫీసునుంచి వెళ్ళిపోయాడని చెప్పారు. అప్పుడు ఇంటి అడ్రసుకు ఫోనుచేసి గవర్నమెంటు హాస్పిటల్‌కి రమ్మని, ఇన్‌స్పెక్టరు చెప్పాడు ఫోనులో.

కామాక్షి "నేనూవస్తాన"ని ఏడుస్తుంటే మార్కండేయులు "వాడు నిజంగా మనపిల్లవాడే అయితే చూసి నేను ఇంటికి తీసుకువస్తాను" అన్నాడు.

ఇదంతా అయేసరికి రాత్రి పదిగంటలుదాటింది.

మార్కండేయులు హాస్పిటల్లో కేజ్యూఅలిటీ వార్డుకు వెళ్ళగా ఇన్‌స్పెక్టరు అక్కడ కనబడ్డాడు.

"మార్కండేయులుగారా మీరు ?"

గజగజ వణుకుతూ "నేనేనండి" అన్నాడు.

"మీపిల్లవాడికి బాగా దెబ్బలు తగిలాయి. రండి చూదురుగాని" అంటూ బెడ్‌దగ్గరికి తీసుకువెళ్ళాడు.

మంచమ్మీద ముఖం కనబడకుండా బట్ట కప్పివుంది.

మార్కండేయులు ముఖం మీద బట్టతీసి చూశాడు. వెంటనే స్పృహ తప్పి మంచందగ్గరే కూలబడిపోయాడు.

డాక్టర్ సహాయంతో అతడికి స్పృహ తెప్పించి "ఈ దేహాన్ని మీరు ఎట్లా తీసుకువెళ్తారు ?" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"బాబూ ఎటువంటి మాటన్నారు? ఈ దేహాన్ని ఎట్లా తీసుకువెళ్తారని కదూ? నా బిడ్డ ఏంతప్పుచేశాడనీ ఈ శిక్ష ? న్యాయం ధర్మం ఎవరికీ అక్కరలేనివయి పోయాయా ? వాటిని త్యజించి మనం బ్రతుకుతామా ? ఇంతకూ బాబు చనిపోయింది వీటిని నిలబెడదామనా ? అందుకేనా ఈశిక్ష నాకూ వాడికీ ? ఈ దేహాన్ని ఎట్లా చేర్చినా ఒకటే. ఒక టాక్సీని ఇప్పించండి. ఈ ధర్మమూర్తిని తల్లికి కూడా చూపించాలి కదా ? ఆమె కూడా చూసి ఒక ఏడుపు ఏడ్చిన తరువాత ఈ న్యాయాన్నీ ధర్మాన్నీ దహనం చేస్తాను."

మార్కండేయులు మరి నిలబడలేక నేలమీద పడిపోయాడు. ఇన్‌స్పెక్టరు రెండు శవాలను టాక్సీలో పోలీసుసహాయంతో ఇంటికి పంపించాడు.

ఆ రెండు శవాలనూ చూసిన కామాక్షిని ఎవరు ఓదార్చగలరు ? ఎవరికి సాధ్యం ?

అర్ధరాత్రి అయినా పోలీసుజీపూ టాక్సీ వచ్చాయనగానే పదిమందీ పోగయి నారు. కామాక్షి పరిస్థితిచూసి స్త్రీలందరూ ఆమెను ఓదార్చటానికి ప్రయత్నిస్తు న్నారు. ఒక ముసలమ్మ అందరినీ దాటుకుంటూ వచ్చి "కామాక్షీ, నా నలుగురి పిల్లలతోసహా నా భర్తను వరసగా నిలబెట్టి కాల్చాడు. నా కళ్ళఎదుట ఒక ధూర్తుడు. ఆ సంఘటనను ఎదుర్కోలేక నేను శవంలా పడిపోయాను. కాని, నేనింకా జీవించవలసి ఉంది. బ్రతికే ఉన్నాను చూశావా ? మనను చూడగానే ఆ ఘాతుకచర్యలు అందరికీ జ్ఞాపకానికి వస్తాయి. కామాక్షీ, నన్ను చూసి కళ్ళు తుడుచుకుని మనసును రాయిచేసుకో." కామాక్షి ఆమె మాటలు వినేస్థితిలో లేదప్పుడు.

"మామ్మగారూ, నా బాబు వెళ్ళిపోయినాడు. ఆయన కూడా వాడితో వెళ్ళి పోయారు.

వాడిని వదిలి ఉండలేరు ఆయన. నేనూ ఉండలేను అంతే మామ్మగారూ. నన్నూ వాళ్ళతో పంపించేయండి."

కామాక్షి నేలమీదపడి దొర్లిదొర్లి ఏడుస్తున్నది.